

శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో శ్రీశైలం జలాశయం నాలుగు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ఎగువన ఉన్న జూరాల, హంద్రీ, సుంకేశుల జలాశయాల నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు సుంకేశుల జలాశయం నుంచి 72,114 క్యూసెక్కులు హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు స్పిల్ వే ద్వారా 1,79,971 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయంలో నీటి మట్టం 884.70 అడుగులకు, నీటి నిల్వ 213.8824 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఈనాడు మహబూబ్‌నగర్

ఆదివారం అక్టోబరు 20, 2024

చిన్నారుల ఆరోగ్యం మీ చేతుల్లోనే!

- 55 శాతం విద్యార్థుల స్నాక్స్ డబ్బాల్లో జంక్ ఫుడ్
- తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు




మహబూబ్‌నగర్: ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం తింటున్న ఓ పాఠశాల చిన్నారులు

ఈనాడు, మహబూబ్‌నగర్ -న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ సాంస్కృతికం

చిన్నారులు వాతావరణంలో చిన్న చిన్న మార్పులనే తట్టుకోలేరు.. వాంతులు, విరేచనాలు, జ్వరం బారినపడి ఇబ్బందుల పాలవుతారు. ఒక్కసారి అస్వస్థతకు గురైతే వారం వరకు కోలుకోరు. అలాంటి వాళ్లకు ప్రమాదకరమైన జంక్ ఫుడే రోజూ పెడితే వారి లేత పేగులు ఎలా తయారవుతాయి. .? వారి ఆరోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుంది. .? వారి భవిష్యత్తు ఏమవుతుంది? ఆలోచిస్తేనే భయమేస్తుంది.. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది తల్లిదండ్రులు అలాంటి ఆహారమే పెడుతున్నారని 'ఈనాడు' పరిశీలనలో తేలింది. ఇలా చేయటం పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.



మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల చిన్నారుల స్నాక్స్ డబ్బాల్లో తెచ్చుకున్న బిస్కెట్లు, జంక్ ఫుడ్



55 శాతం మందికి జంక్ ఫుడే : నేడు మూడు, నాలుగేళ్ల ప్రాయం నుంచే చిన్నారులను బడికి పంపిస్తున్నాం. ఉదయం 9 గంటల కల్లా వారు పాఠశాలల్లో ఉంటున్నారు. మధ్యాహ్నం తినే భోజనం కూడా ఉదయమే వండి పంపిస్తున్నారు. మధ్యలో తినడానికి చిరుతిళ్ల (స్నాక్స్) డబ్బాలో పెడుతున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా కేంద్రాల్లోని పాఠశాలల్లో 1,000 మంది చిన్నారుల చిరుతిళ్ల డబ్బాలు 'ఈనాడు' పరిశీలించగా 55 శాతం చిప్స్, చాక్లెట్లు, మైదా పదార్థాలతో కూడిన ప్రమాదకర ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్, బిస్కెట్లు కనిపించాయి. ఉరుకులు పరుగుల జీవితంలో సమయం లేదని తల్లిదండ్రులు సులభమైన పనిగా ఇలా చేస్తున్నారు. కొందరు తల్లిదండ్రులను అడిగితే పిల్లలు అవే తింటారని చెబుతున్నారు. 35.2 శాతం తల్లిదండ్రులు మాత్రం ఇంట్లో వండిన ఆరోగ్యకర ఆహార పదార్థాలు, చిరుతిళ్లు పంపించారు. మరో 9.8 శాతం మంది పిల్లలకు పండ్లను పంపించారు. మొత్తంగా 45 శాతం చిన్నారులకు మంచి ఆహారమే అందుతోంది.

గుర్తించినవి ఇవే..



అమలు కాని నిషేధం : నిబంధనల ప్రకారం ఐదో తరగతి లోపు చిన్నారులు ఉండే పాఠశాలలకు సమీపంలో చిప్స్, ఇతర జంక్ ఫుడ్ విక్రయించొద్దు. ఇది ఎక్కడా అమలు కావటం లేదు. పాఠశాలలకు ఆనుకునే ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులు ఇచ్చే రూ.5, రూ.10లతో జంక్ ఫుడే కొనుక్కుని తింటున్నారు.



నీటి గంట అవసరం : చాలా పాఠశాలల్లో విద్యార్థులు స్నాక్ డబ్బాతో పాటు నీటిసీసాలు తెచ్చుకుంటున్నారు. 80 శాతం చిన్నారులు భోజనం సమయంలో మాత్రమే నీటిని తాగుతున్నారు. సీసాల్లోని నీటిని అలాగే ఇంటికి తీసుకొస్తున్నారు. పాఠశాలల్లో నీటి గంట(వాటర్ బెల్) అమలు చేయాల్సిన అవసరముంది.



ఈ ప్రయత్నం బాగు : మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, జడ్చర్ల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు జంక్ ఫుడ్ తినకుండా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి. ఎవరైనా జంక్‌ఫుడ్ తెచ్చుకుంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి అవగాహన కల్పిస్తున్నారు.



ఇన్‌ఫెక్షన్లు, ఊబకాయం సమస్యలు : చిన్నారులకు జంక్ ఫుడ్ అలవాటైతే అన్నంపై ఆసక్తి చూపరు. జీర్ణ శక్తి మందగిస్తుంది. మాంసకృత్తులు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు అందక ఎదుగుదల లోపించి ఆరోగ్యం దెబ్బతింటుంది. జంకుఫుడ్‌లో నూనె, కలుషిత పదార్థాలు అధికంగా ఉంటాయి. వాటిని తినటం వల్ల పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతాయి. వయస్సు పెరిగే కొద్ది గ్యాస్, కడుపునొప్పి, ఊబకాయం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారినపడి అస్వస్థతకు గురవుతారు.

- డా.బాల శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



పండ్లు, పోషకాహారం అవసరం.. : ప్యాకింగ్ ఆహారంలో గ్యాస్ ఉంటుంది. కవర్ వాసన వస్తుంది. బిస్కెట్లలో మైదా ఎక్కువగా ఉంటుంది. వీటిని నమలకుండానే తినేస్తుటారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలకు చిప్స్, ఇతర ప్యాకింగ్ ఆహారాన్ని స్నాక్స్ డబ్బాల్లో అస్సలు పెట్టొద్దు. ఐదో తరగతిలోపు చిన్నారులకు పండ్ల రసాలు, పండ్లు, క్యారెట్, కీరా, జావ, ఇంట్లో తయారు చేసే సంప్రదాయ అల్పాహారం పెట్టాలి. రక్తహీనత బారినపడకుండా పెద్ద పిల్లలకు పల్లీలు, బెల్లం చిక్కీలు, బాదం, పిస్తా, లడ్డూలు, ఉడకపెట్టిన గుడ్లు, పండ్లు అందించాలి.

- శైలజ, పోషకాహార కౌన్సిలర్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

అరకొర కేటాయింపులతో అవస్థలు

ఉద్యాన రైతులకు దక్కని తుంపర పరికరాలు



వేరుసెనగ చేనులో తుంపర పరికరాలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం : ఉద్యాన శాఖలో తుంపర పరికరాల పంపిణీ పెద్ద సమస్యగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై తుంపర పరికరాలను అందించాలని నిర్ణయించినా ఒక్కో మండలానికి ఐదు యూనిట్లను కూడా కేటాయించలేదు. యాసంగి పంటగా వేరుసెనగ సాగు చేసిన రైతుల నుంచి మాత్రం భారీగా డిమాండ్ ఉంది. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా 6,500 మంది రైతులు తుంపర పరికరాలు కావాలని దరఖాస్తు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క జోగులాంబ గద్వాల జిల్లాలోనే డిమాండ్ తక్కువగా ఉంది. జిల్లాకు 80 యూనిట్లను మాత్రమే కేయించగా ఎస్సీ, ఎస్టీ రైతులను ఎంపిక చేశారు. మరో 500 మంది వరకు రైతులు పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రచారం లేకపోయినా భారీ దరఖాస్తులు : ఉమ్మడి జిల్లాలో వేరుసెనగ పంట 2.60 లక్షల ఎకరాల్లో సాగైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.20 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా సాగవుతుంది. అందుకే ఇక్కడ తుంపర పరికరాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. గడచిన ఐదేళ్లుగా తుంపర పరికరాలపై గత ప్రభుత్వం రాయితీ ఇవ్వలేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.23,385గా ధర నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం 75 శాతం అంటే రూ.17,539 రాయితీగా భరిస్తుంది. మిగతా 25 శాతంగా రూ.7,483లను రైతు డీడీ తీసి ఉద్యాన శాఖకు సమర్పిస్తే 25 హెచ్‌డీ పైపులు, ఐదు తుంపర పరికరాల నాజిల్స్ అందిస్తారు. ఉమ్మడి జిల్లాకు 958 యూనిట్లను మాత్రమే కేటాయించగా 18,100 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు ప్రచారం చేసి ఉంటే ఇంకా రెండు మూడింతల దరఖాస్తులు వస్తాయంటే అతిశయోక్తి కాదు.

జిల్లా	దరఖాస్తులు	యూనిట్లు
నాగర్‌కర్నూల్	6,500	516
మహబూబ్‌నగర్	2,900	100
నారాయణపేటలో	3,200	100
వనపర్తిలో	5,000	162
గద్వాల	580	80

అధికారులకు తలనొప్పిగా.. : ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వం కేటాయించిన అరకొర యూనిట్లను వేల మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి పంచాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చి కార్యాలయాల్లోని అధికారులకు అందిస్తున్నారు. కొందరు ఫోన్లు చేయిస్తున్నారు. జిల్లాల అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా మరిన్ని యూనిట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు జగన్, అక్బర్, వేణుగోపాల్, సురేష్‌లు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యేలు కూడా చెప్పారని పేర్కొన్నారు.

పీయూ ఉపకులపతి బాధ్యతల స్వీకరణ



ఇన్‌ఛార్జి వీసీ నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.జీఎన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది మే 21 నుంచి ఉపకులపతి పోస్టు ఖాళీగానే ఉంది. లక్ష్మీకాంత్ రాథోడ్ తర్వాత రెగ్యులర్ ఉపకులపతి రాకపోవడంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న నదీం అహ్మద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఉపకులపతి శ్రీనివాస్ పాలమూరు విశ్వవిద్యాలయానికి రానున్నారు.



- 'అబ్బబ్బా.. ఈ మధ్య పని ఎక్కువైంది. మా పిల్లలు తిన్న తర్వాత కంచం తీయరు. బడి నుంచి వచ్చి పుస్తకాల సంచి ఓ చోట, దుస్తులు మరోచోట పారేస్తారు. వాటిని సర్దాలంటే తల ప్రాణం తోక కొస్తోంది'.

  అంటూ ఓ తల్లి పని మొత్తం చేస్తారు

- 'మా పాప డిగ్రీ చదువుతోంది.. ఇల్లు ఊడ్చదు. కంచంలోంచి కింద పడిన మెతుకులు తీయదు. మా వాడికేమో దుప్పటి మడతపెట్టడం రాదు. గదుల్లో లైట్లు ఆఫ్ చేయాలన్నా మా పనే..'

  మరో మాతృమూర్తి ఇంటి పనంతా చక్కబెడతారు

ఇంత వరకు బాగానే ఉన్నా, వారిని మార్చాల్సింది.. కొంతలో కొంతైనా పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు.. తల్లే కదా!

ఆదివారం అమ్మకు తోడుగా..

న్యూస్‌టుడే-కొత్తకోట



సెలవుల్లో చరవాణులను పక్కన బెట్టి అమ్మకు సాయం చేద్దాం అనే భావన పిల్లల్లో కల్పించాలి. వారిలో తప్పని సరిగా మార్పు వస్తుంది. వారు కోరుకున్న వంట వారి చేతే చేయించండి. ఆ అనుభూతే వేరు. ప్రేమించడం తప్పు కాదు.. కాని, ఆ ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారితే జీవన నైపుణ్యాలు లేక పిల్లల ఉన్నతికి ప్రతి బంధకమవుతుంది. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణుల హెచ్చరిక. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే గృహ నిర్వహణలో ఆర్థిక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో ప్రస్తావించింది. వీటిని 'ఆదివారం' నుంచి ఆచరించడంలో పిల్లలను ప్రోత్సహిద్దాం.



బాధ్యత పెరుగుతుంది : సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. వారిలో ధైర్యం, పట్టుదల, క్రమ శిక్షణవంటి లక్షణాలు అలవడుతాయి. వారిపై నమ్మకం ఏర్పడుతుంది. సేవాలక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొంటారు. ఇంట్లో అందరూ పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి గడిపే నాణ్యమైన సమయం పెరుగుతుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మంచి చెడు పంచుకోవడంతో ఈ తరాన్ని వేధిస్తున్న ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటివి దరి చేరవు.

పిల్లలతో ఇంటి పనులు చేయిద్దాం

(పని, విద్య పుస్తకంలో నిర్దేశించిన కృత్యాలు)

- ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపరచుకోవడం
- చెప్పులు, బూట్లను శుభ్రం చేసి క్రమపద్ధతిలో పెట్టుకోవడం
- విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సలహా మేరకు వేయడం
- వినియోగ వస్తువులను, దుస్తులు, పుస్తకాలు, క్రమపద్ధతిలో అమర్చుకోవడం
- ఇంటి సరకులు తీసుకురావడంలో సాయం చేయడం
- నీళ్లు పట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడంలో సహకరించడం
- మొక్కలకు నీళ్లు పట్టడం, ఎరువులు వేయడం
- భోజనవేళలో తాగునీరు ఏర్పాటు చేయడం, కంచాలు తీసి కడగడం
- మరుగుదొడ్లను వినియోగించాక నీరు పోసి పరిశుభ్రంగా ఉంచడం





తల్లిదండ్రులదే బాధ్యత : పిల్లల్ని మీరు నిజంగా ప్రేమిస్తున్నట్లయితే వారితో తరచూ ఇంటి పనులు చేయించండి. వారికి బాధ్యతలను గుర్తు చేయండి. ఏ పని చేస్తున్నా బాగుంది.. ఇంకా వేగంగా.. మెరుగ్గా.. చేయగలవంటూ ప్రోత్సహించండి. వారి భాగస్వామం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని అర్థమయ్యేలా చెప్పండి. పిల్లల్ని ప్రేమించడంతో పాటు వారికి అన్ని నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.

- శ్రీనివాసరాజు, మానసిక వైద్యనిపుణులు, మహబూబ్‌నగర్

నేలకొరిగిన మహావృక్షం



చెదలు పట్టి వేళ్లతో సహా ఒరిగిన మర్రిచెట్టు

న్యూటౌన్‌లో తితిదే కల్యాణ మండపం ప్రహరీ పక్కన కూలిన మహావృక్షం

పాలమూరులో న్యూటౌన్ ప్రాంతానికి ప్రతీకంగా ఉన్న మహావృక్షం నేలకొరిగింది. శనివారం వర్షం లేదు.. ఈదురు గాలి లేదు. చెదలు పట్టడంతో ఆ మర్రివృక్షం కూకటి వేళ్లతో సహా కుప్పకూలింది. 40 ఇళ్ల కాలనీ (న్యూటౌన్) ఎక్కడ అంటే మర్రిచెట్టు వద్ద అని చెప్పేవారు. 1960 ప్రాంతంలో ఇక్కడ 40 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో క్లాక్ టవర్, టీడీగుట్ట, రామమందిరం, ఆకుల చౌరస్తా, బండ్లగేరి, బ్రహ్మాన్‌వాడి, రవీంద్రనగర్, వల్లభ్‌నగర్, హనుమాన్‌పుర, పాత పాలమూరు, రామయ్యబౌలి, మేకలబండ వైపే పాలమూరు పట్టణం విస్తరించి ఉండేది. తొలిసారిగా 40 ఇళ్లు నిర్మించడంతో ఈ ప్రాంతానికి న్యూటౌన్‌గా పేరు సార్థకమైంది. 40 ఇళ్ల నిర్మాణానికి ముందు ప్రస్తుతమున్న రోడ్లు, భవనాల శాఖ సముదాయం, అతిథిగృహం, నీటి పారుదల శాఖ భవనంతో కూడిన ప్రాంతమంతా ప్రభుత్వ భూమే. అప్పట్లోనే ఈ మర్రిచెట్టు ఎంతో విశాలంగా విస్తరించి ఉండేదని చెబుతారు. తొలిసారిగా ప్రభుత్వ స్థలం కేటాయించి గృహనిర్మాణ సంస్థ ద్వారా 40 ఇళ్లు నిర్మించడంతో న్యూటౌన్‌గా పిలుస్తూ వచ్చారు. మర్రిచెట్టుకు సమీపం నుంచి తితిదే కల్యాణ మండపాన్ని నిర్మించారు. కొత్తవాళ్లు ఆర్టీసీ బస్సు దిగి న్యూటౌన్ ఎక్కడ అని అడిగితే మర్రిచెట్టు దగ్గరని ఇప్పటికీ చెబుతారు. న్యూటౌన్ ప్రాంత మహిళలు ఈ మర్రిచెట్టును పండగల రోజుల్లో పూజించేవారు. చెట్టు వద్ద దేవుడి పటాలు పెట్టి చుట్టూ దారాలు చుట్టి మొక్కులు చెల్లించేవారు. ఎంతో అనుబంధమున్న మర్రిచెట్టు నేలకొరగటం స్థానికులను బాధించింది.

- న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

విద్యారంగానికి ప్రాధాన్యం: యెన్నం



విద్యార్థులకు మెరిట్ ఉపకార వేతనాలను అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 34 మంది పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతతో పాటు మరో 32 మంది విద్యార్థులకు రూ.4.55 లక్షల మెరిట్ ఉపకార వేతనాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే 10 ఏళ్లలో 20వేల మంది నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. విద్య, ఆరోగ్యంపై తమ సర్కార్ దృష్టి సారించిందన్నారు. పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ప్రిన్సిపల్ మోహన్‌బాబు, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, రామేశ్వర్, శ్రీనివాస్, రాఘవేందర్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?



ముదిరెడ్డిపల్లి నుంచి పోలేపల్లికి అపసవ్య దిశలో వెళ్తున్న ప్రైవేటు పాఠశాల బస్సు

జాతీయ రహదారి-44 మీదుగా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి నుంచి జడ్చర్ల మండలం పోలేపల్లికి జడ్చర్ల పట్టణానికి చెందిన పలు ప్రైవేటు పాఠశాల బస్సులు రోజూ అపసవ్య దిశలోనే వెళ్తున్నాయి. శనివారం ఉదయం ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులో సుమారు 40 మంది విద్యార్థులను రాజాపూర్‌లో ఎక్కించుకొని పోలేపల్లికి అపసవ్య దిశలో వెళ్తున్న దృశ్యమిది. అపసవ్య దిశలో వెళ్లొద్దని డ్రైవర్‌ను హెచ్చరించినా తీరు మార్చుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసులు స్పందించి అపసవ్య దిశగా వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రాజాపూర్, జడ్చర్ల


విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం



జడ్చర్లలో జరిగిన విద్యుత్తు వినియోగదారుల సదస్సులో మాట్లాడుతున్న ఫోరం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు

జడ్చర్ల, జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదుల తక్షణ పరిష్కారమే తమ లక్ష్యమని విద్యుత్తు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు సి.నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యుత్తు వినియోగదారుల ఫోరం సమావేశం జడ్చర్ల డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ నుంచి 250 ఫిర్యాదులు రాగా దాదాపు అన్నీ పరిష్కరించామన్నారు. వినియోగదారులు నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. విద్యుత్తు శాఖ జిల్లా ఎస్ఈ రమేశ్ మాట్లాడుతూ జీరో బిల్లులకు దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరిగిన మాట వాస్తవమేనన్నారు. పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 1.26 లక్షల గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లులు అందుతున్నట్లు చెప్పారు. 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, వినియోగదారుడు నర్సింహారావు రంగారావుతోట, సంతోషిమాత ఆలయం, అయోధ్యనగర్, చైతన్యనగర్ ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్లు ఏర్పాటుచేయాలని కోరారు. జడ్చర్లలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్తు బిల్లుల్లో హెచ్చుతగ్గులు, కొత్త నియంత్రికలు, లైన్లకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వచ్చినట్లు ప్రకటించారు. 10వ వార్డులో నియంత్రిక తొలగింపుపై ఆ ప్రాంతానికి చెందిన ఖాజా మైనోద్దీన్ ఫిర్యాదు చేశారు. అధికారులు, లైన్‌మెన్లు మీటర్లు, కొత్త లైన్ల ఏర్పాటుకు డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సాంకేతిక సమస్యలను తక్షణం పరిష్కరించకపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని వివరించారు. సమావేశంలో జడ్చర్ల డీఈ చంద్రమౌళి, ఏడీలు చంద్రమోహన్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరం.. పర్యాటక సోయగం!



సోమశిలకు పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటోంది. నదిని ఆనుకుని ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేలా కొత్త రిసార్టులు వెలుస్తున్నాయి. సోమశిలలో ఓ చోట కనిపించిన దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. శనివారం గద్వాలకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతికి సంగాల పార్క్ వద్ద కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ చౌక్, పాతబస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పదో పటాలం డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



దీక్షితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ రచయితగా పాలమూరు జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాల విద్యార్థినీ దీక్షితకు విజయం సాధించింది. ఈ మేరకు ఆ విద్యార్థినికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయిలో పాలమూరు విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని గెలిచినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, డీఎస్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్లు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో గద్వాల జిల్లా, తృతీయ స్థానంలో నారాయణపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తృతీయ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గెలుపొందిన క్రీడాకారుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు శారదాబాయి, పాండు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వడెన్న, జేపీఎన్‌సీఈ రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హంగుల్లో తగ్గేదేలే!

హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులోనూ గృహాలంకరణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే పోలీస్ ఉద్యోగి తన అభిరుచి మేరకు అద్భుతంగా ఇంటిని నిర్మించారు. 235 గజాల స్థలంలో రూ.1.60 కోట్లతో ఇంటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ ఇంటిలోని ఓ గదిలో గోడకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన హంస బొమ్మ ఆకట్టుకుంటోంది. కేవలం ఆ బొమ్మ కోసమే రూ.42 వేలు ఖర్చు చేశాడు. ఇంటిలోని అంతర్గత నిర్మాణం కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు తన ఆసక్తి మేరకు 185 గజాల్లో రూ.1.40 కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారు. ప్రతి గదిలో అందంగా ఆకట్టుకునేలా బొమ్మలు, ఇతర గృహోపకరణాలను వినియోగించారు. పడక గదిలో విభిన్నంగా విద్యుత్తు కాంతి వచ్చేలా అద్భుతంగా చిత్రాలు అమర్చారు. గృహాలంకరణకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ : ఓ ఇంట్లోని హోం థియేటర్

న్యూస్‌టుడే, పాలమూరు, కల్వకుర్తి

ఇల్లు కట్టుకోవటం ఓ కళ. అన్ని హంగులతో ఇంటిని ఏర్పాటు చేసుకొని చిరకాల వాంఛ తీర్చుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పట్టణాల్లో రహదారుల సుందరీకరణ, తదితర సౌకర్యాలు సమకూరుతున్నాయి. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి భవనాల నిర్మాణం చేసుకుంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరుతున్నాయి. అయిదు జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 19 పురపాలికల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర రాజధాని నగరం 100 కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో హంగులతో సొంతింటికి మొగ్గు చూపుతున్నారు. అవసరాలు, అభిరుచుల మేరకు అధునాతన వసతులు, భవనాలను అద్భుతమైన రీతిలో నిర్మించు కుంటున్నారు.

● హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గృహాలంకరణ నిపుణులను పిలిచి పనులు అప్పగిస్తున్నారు. గదుల్లో అలంకరణ, పడక, పూజ గదులను దేనికదే ప్రత్యేక సంతరించుకునేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓపెన్ కిచెన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాన్య ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఉన్నతోద్యోగులు, రాజకీయ నాయకుల ఇళ్లలోనూ ఆకర్షణీయ హంగుల కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు.



చేతితో తాకే అద్దంలో వెలుగుతున్న విద్యుద్దీపాలు



రూ.5 లక్షలతో నిర్మించిన అధునాతన వంట గది



కల్వకుర్తి : ఓ ఇంట్లో జిగేల్‌మనిపించే గది అలంకరణ

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల బాలికల జట్లను శనివారం మహబూబ్‌నగర్‌లోని బీఎస్‌ఏ మైదానంలో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న విలువిద్య పోటీలకు ఈ జట్లను పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, విలువిద్య కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అండగా ఉంటా : కేటీఆర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం వెంకటాపూర్‌కు చెందిన వైద్య విద్యార్థి సుస్మితకు అండగా ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. స్పందించిన కేటీఆర్ 'ఐ విల్ సపోర్ట్ పర్సనల్లీ' అంటూ 'ఎక్స్'లో సందేశం పెట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



'ఎక్స్'లో కేటీఆర్ సందేశం

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



రైలు చక్రాల వద్ద ద్విచక్ర వాహనం

మానవపాడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ దాటిస్తున్న క్రమంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టిందని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఏఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడు. శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వర్షపునీరు నిలవడంతో సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ మీద దాటించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వచ్చేసింది. ద్విచక్ర వాహనాన్ని వదిలేసి రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనం కింద ఉండిపోవడంతో పది నిమిషాలు రైలు ఆగింది. దాన్ని ట్రాక్‌పై నుంచి తొలగించాక రైలు వెళ్లిపోయింది. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

యువకుల గొడవ సీసీ ఫుటేజీ వైరల్

శిరోముండనంలో పోలీసుల పాత్రపై బలపడుతున్న అనుమానాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, లింగాల : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు ముందు జరిగిన గొడవ సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగాక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ముగ్గురికి శిరోముండనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటం, ఇందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. యువకుల మధ్య గొడవతోనే అతడు ఆత్మహత్యాయత్నం చేశాడని, పెట్రోల్ బంక్ వద్ద గొడవ, శిరోముండనం ఘటనలకు, తమకు సంబంధం లేదని పోలీసులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ యువకులు పెట్రోల్ బంకు వద్ద గొడవ పడిన సీసీ కెమెరా ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడిపోయారు. ఈ ఫుటేజీతో శిరోముండనం ఘటనలో పోలీసుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడి తల్లిదండ్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న వీడియోలు బయటకు రావటంతో వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. అక్కడి ఫుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్న చర్చ జరుగుతోంది.

ఇటీవలే ఇసుక వ్యవహారం రచ్చ.. : దుందుభి వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 10 రోజుల కిందట జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులపై మచ్చ పడింది. ఈ వ్యవహారం మరవక ముందే లింగాలలో యువకుల శిరోముండనం ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఘటనలపై విచారణ చేపడతామని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నేతల ఒత్తిడితోనే జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లలేకపోతున్నారని వినిపిస్తోంది.

వాహనం నుంచి జారిపడి బాలకార్మికుడి మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో శనివారం ఉదయం వాహనం నుంచి జారి కింద పడి బాలకార్మికుడు (17) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చుక్కాయిపల్లి నుంచి తాడూరుకు పత్తితీత కోసం కూలీలు సుమారు పన్నెండు మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. పెద్దకొత్తపల్లి దాటాక అదుపు తప్పి వాహనంపైన కూర్చున్న బాలుడు (17) కిందపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకు చెందిన పాటిమిటి చిన్నరాజు, లలిత దంపతులు. ఆమెకు అదే గ్రామానికి చెందిన మధుగాని కురుమూర్తితో వివాహేతర సంబంధం ఉంది. 2019 మే 30న కురుమూర్తి జాతరకు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. అక్కడికి ఆమె ప్రియుడు కూడా వచ్చాడు. భర్తకు మద్యం తాపించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి టవల్‌తో గొంతుకు చుట్టి చంపేశారు. దీంతో మృతుడి అన్న అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసు పరిశోధించి హత్యతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బెయిల్‌పై బయటికి రాగా తరువాత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది, అందులో వాదోపవాదనలు విన్న కుటుంబ న్యాయస్థాన జడ్జి శ్రీదేవి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానాను విధించారు.

సస్యరక్షణ చర్యలకు సన్నద్ధం!



ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు పురుగు మందుల పిచికారీకి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పిచికారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు. యంత్రాల మెకానిక్‌లు కూడా తీరిక లేకుండా కనిపిస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద మరమ్మతుల కోసం రైతులు వరుసగా పెట్టిన పిచికారీ యంత్రాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ రన్నరప్



పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ పోలీసులు సత్తా చాటారు. వీడియోగ్రఫీ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీస్ అకాడమీలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉమ్మడి జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో, నారాయణపేట జిల్లాకు చెందిన ఏఆర్ పీసీ -3341 చంద్రశేఖర్ గౌడ్ వ్యక్తులను తనిఖీ చేయడంలో విశేషమైన ప్రతిభ చాటారు. వారికి వెండి పతకం వచ్చింది. దీంతో జోగులాంబ జోన్ పోలీస్ శాఖకు ఓవరాల్ రన్నరప్‌గా నిలవడంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ట్రోఫీని గెలిచిన వారికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం


స్వామి కల్యాణ క్రతువులో భక్తులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం: మహబూబ్‌నగర్ పట్టణం శ్రీనివాసకాలనీలోని శ్రీవల్లి దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండోరోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త బ్రహ్మాండ గురునాథశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిపించారు. ఆదివారం నాగేంద్రస్వామి, జంటనాగులు, నవగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని ఆలయ ధర్మకర్త గురునాథశర్మ కోరారు.

శ్రీ కురుమూర్తి స్వామివారి హుండీ ఆదాయం రూ.3,18,276

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీ కురుమూర్తి స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించగా రూ. 3,18,276 హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి ఆలయ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గత నెల రోజుల నుంచి స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచారి, గోపాల్, కురుమూర్తి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు

హన్వాడ: మండల పరిధిలోని పలు రహదారులకు ప్రభుత్వం నిధులను కేటాయించింది. పతేపూర్ మైసమ్మ దేవస్థానం నుంచి గుమ్మలపల్లి వరకు వెళ్లే 3.8 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 4.50 కోట్లు మంజూరయ్యాయి. కిష్టంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మహ్మదాబాద్ మండలం జూలపల్లి వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుకు రూ. 1.50 కోట్లు కేటాయించారు. చిన్నదర్పల్లి బీటీ రోడ్డు నుంచి కొత్త చెరువుతండా రోడ్డుకు రూ. 3.35 కోట్లు మంజూరు చేశారు. పుల్పొనిపల్లి నుంచి కొంపల్లి వరకు ఉన్న రోడ్డును బీటీగా మార్చేందుకు రూ. 2 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు, ప్రజలు శనివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

అధిక లోడ్ టిప్పర్లపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలో నూతనంగా బీటీ రహదారులు నిర్మిస్తుండడంతో టిప్పర్లను ఓవర్ లోడుతో నడపకూడదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ఎమ్మెల్యే శనివారం మండల కేంద్రంలో అధిక లోడ్‌తో రోడ్డు దాటుతున్న టిప్పర్లను ఆపి వేబిల్, ప్రమాద రికార్డులను తనిఖీ చేశారు. ఓవర్ లోడ్ వల్ల రహదారులు పాడైపోతున్నాయని, తద్వారా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఓవర్ లోడుతో వెళ్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్సై తిరుపాజీకి సూచించారు.

భూ అక్రమాలపై విచారణ చేయండి

మిడ్జిల్, న్యూస్‌టుడే: మిడ్జిల్ మండలంలో జీపీ ప్లాట్లుగా వేసి విక్రయించిన భూమిని మళ్లీ వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శనివారం కలెక్టర్ విజయేందిర బోయిని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. మిడ్జిల్ మండలంలో 2007లో ప్లాట్లుగా వేసి విక్రయించిన భూమిని ఇటీవల వ్యవసాయ భూమిగా మార్చి మళ్లీ రిజిస్ట్రేషన్ చేశారంటూ 'ఈనాడు'లో వచ్చిన కథనాలపై స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు.

అధికారుల పరిశీలన

మిడ్జిల్, న్యూస్‌టుడే: మిడ్జిల్ మండల కేంద్రంలో చోటుచేసుకున్న భూ అక్రమాలపై 'ఈనాడు'లో ప్రచురితమైన 'ఇదో భూదందా' కథనంపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల సర్వేయర్ దనుంతి, ఆర్ఐ అంజిక భూములను పరిశీలించారు. గ్రామ శివారులోని పట్టా భూములను కొనుగోలు చేసి 2007లో ప్లాట్లుగా విక్రయించి, ఇటీవల తిరిగి ఎకరాల చొప్పున విక్రయిస్తున్న మతలబుపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి వివరాలను నమోదు చేశారు. సిబ్బంది కృష్ణయ్య, గౌస్, మల్లేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

మిడ్జిల్, న్యూస్‌టుడే: మిడ్జిల్-మల్లాపూర్ తండా రహదారి ఆక్రమణతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని భాజపా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకు ఫిర్యాదు చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి రోడ్డు ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నాయకులు తిరుపతి, నరేశ్‌యాదవ్, అరవింద్, యాదయ్య, విష్ణు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి కళాభారతి

పాలమూరు, పురపాలకం: కళాభారతి భవన సముదాయాన్ని పట్టణ పౌరులకు త్వరలో అందుబాటులోకి తెస్తామని పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఇతర కౌన్సిలర్ల బృందంతో కలిసి పురపాలిక ఆవరణలో నిర్మాణమైన కళాభారతి భవన సముదాయాన్ని పరిశీలించారు. కళాభారతిలో మిగిలిన నిర్మాణం, ఫర్నీచర్ బిగింపు, సౌండ్ సిస్టమ్, విద్యుద్దీకరణ వంటి పనులు పూర్తి కావాల్సి ఉందని, వీటన్నింటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పాలమూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో కార్మికులతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న దొంగతనాలపై కక్షపూరితంగా అసత్య ప్రచారాలు కార్మికులపై చేస్తున్నారని మండిపడ్డారు. నిరాధార ఆరోపణలతో గత నెల రోజుల నుంచి కార్మికులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు చెన్నయ్య, రంగన్న, మొగులన్న, బాలకృష్ణ, యాదయ్య, దేవానంద్, నరసింహ, గంగాధర్, ప్రవీణ్, అంజమ్మ, సత్యమ్మ, పద్మ, నాగమ్మ పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి


ఎన్మన్‌గండ్ల గ్రామ శివారులో కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నవీన్

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎన్మన్‌గండ్ల గ్రామ శివారులోని సర్వే నంబరు 465లో 'సేవాలాల్' ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం ఆర్డీవో నవీన్ పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి దస్త్రాలను పరిశీలించారు. ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులను ఆదేశించారు. ఆర్ఐ కిరణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తుల్జారాం, నీలానాయక్, సర్వేయర్ మహ్మద్ అమీనోద్దీన్ పాల్గొన్నారు.

పరీక్ష రాసి.. ప్రతిభ చాటి


మహబూబ్‌నగర్: గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న ప్రజ్ఞా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గోపు చెల్మారెడ్డి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్లలోని లోటస్ ఉన్నత పాఠశాల, అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాలంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. లోటస్ పాఠశాలలో సాయి ప్రియదర్శిని ప్రథమ, స్పందన, ద్వితీయ, స్నితిక తృతీయ స్థాయిలో రాణించగా ప్రిన్సిపల్ మేఘారెడ్డి, కరస్పాండెంట్ సంధ్య బహుమతులు అందజేశారు. అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో ప్రనూష ప్రథమ, నిషిత ద్వితీయ, నాగేశ్వరి తృతీయ స్థాయిలో రాణించగా ప్రిన్సిపల్ షేక్ మొహియుద్దీన్, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి బహుమతులు అందజేశారు.

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రతిభ పాటవ పోటీలలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజ్ఞా ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో మేఘన ప్రథమ, జ్యోతి ద్వితీయ, భవశ్రీ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ గోవు చెల్మారెడ్డి బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు బాల ప్రభ, లక్ష్మీనారాయణ, ఇందిరా భవానీ, హైందవి, అన్నపూర్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జడ్చర్ల: విజేతలతో అక్షర కాన్సెప్ట్ పాఠశాల ప్రిన్సిపల్ షేక్ మొహియుద్దీన్

- జిల్లా కేంద్రంలో గెలాక్సీ ఉన్నత పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు 'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీల్లో పాల్గొన్నారు. అందులో అఫియా మహీన్, సిద్రా మహీన్, తేజశ్రీలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ భాను ప్రకాశ్ బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు యాదయ్య, రేష్మా తబస్సుమ్, రమేశ్, నాజియా, శ్వేత పాల్గొన్నారు.


జడ్చర్ల: విజేతలకు బహుమతులు అందజేసిన లోటస్ పాఠశాల ప్రిన్సిపల్ మేఘారెడ్డి


మహబూబ్‌నగర్: విజేతలతో గెలాక్సీ పాఠశాల కరస్పాండెంట్ భాను ప్రకాశ్

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పీయూ రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణపై ఎన్ఎస్ఎస్, పోలీస్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కేంద్ర నాడీ వ్యవస్థ ఆచేతనంగా మారిపోతుందన్నారు. తద్వారా అనేక రకాల వ్యాధులకు గురై, ప్రాణాలు పోతాయని చెప్పారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మత్తుకు బానిసకావడం వల్ల నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. మన జిల్లాలో ఒక అమ్మాయి మత్తుకు బానిసై తన తండ్రిని హత్య చేసిందన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ప్రవీణ, ప్రిన్సిపల్స్ నూర్జహన్, బషీర్ ఆహ్మద్, శాంతి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇళ్లు దక్కాలి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


మహిళ సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే: అవినీతిని సహించేదిలేదని, ప్రభుత్వం కేటాయించే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు కేటాయించకుండా, అర్హులకే దక్కాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మహిళా సమాఖ్య సభ్యులు, ఐకేపీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత భారాస హయాంలో అనర్హులకు ఇళ్ల కేటాయింపులు చేపట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీలో సొంత నాయకులైన అవినీతిని పాల్పడితే సహించేదిలేదన్నారు. ఇళ్ల కమిటీలో మహిళా సమాఖ్య సభ్యులను ఎంపిక చేయడంతో వారితో సమీక్ష నిర్వహించారు. ఊర్కొండ మహిళా సమాఖ్య భవనానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రైతులకు సహకరించాలి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, తదితరులు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: మార్కెట్ యార్డులో వ్యాపారాలు నిర్వహించే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రైతులకు సహకరించాలని మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు బెక్కరి అనిత సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు, మార్కెట్ కమిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మార్కెట్‌కు వచ్చిన సరకులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరలు చెల్లించాలన్నారు. తేమ, తాలు పేరా రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, డీఎంహెచ్‌వో డా.పద్మ, ఇతర అధికారులు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హృదయ్ స్వచ్ఛంద సంస్థ, స్టార్ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిర బోయి ప్రారంభించారు. శిబిరానికి జిల్లా వ్యాప్తంగా 78 మంది చిన్నారులు హాజరయ్యారు. అందులో 10 మంది చిన్నారులు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. 17 మంది చిన్నారులకు మందులతో వ్యాధిని నియంత్రణ చేయవచ్చని వైద్యులు నిర్ధారించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు హృదయ్ సంస్థ ఉచితంగా ఆపరేషన్లు చేయించనుంది. డీఎంహెచ్‌వో డా.పద్మ, డీఐవో డా.పద్మజ, ఆర్ఎంవో డా.జరీనా, చిన్న పిల్లల విభాగాధిపతి డా.సురేశ్, దేవదాస్, విద్య, సుభాష్‌చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

మిడ్జిల్ : పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. శనివారం బోయిన్‌పల్లి గ్రామంలో పశువులకు ఆమె టీకాలు వేశారు. పశువైద్యాధికారి శివరాజ్, అల్వాల్‌రెడ్డి, పర్వతాలు, శ్రీనివాస్, పాండు, మల్లయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ

బాలానగర్: నేరళ్లపల్లిలో గ్యార్వీని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక దర్గాలో ఖమర్ దాదాపీర్ స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన జెండాలతో స్వామి వారిని వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎస్సై తిరుపాజీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం: వీహెచ్‌పీ


తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, వివిధ ధార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోబోమని వీహెచ్‌పీ నేతలు హెచ్చరించారు. రాష్ట్రంలో వివిధ ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ శనివారం మహబూబ్‌నగర్ పట్టణం తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో వివిధ భక్త కమిటీలు, ఆలయ కమిటీలు, అర్చక, పురోహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్ది యాదిరెడ్డి, నలిగేశి లక్ష్మీనారాయణ, భాజపా జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, బ్రాహ్మణ సేవా సమితి జిల్లా బాధ్యుడు గొండ్యాల రాఘవేంద్రశర్మ, కంచికామకోటి పీఠం జిల్లా ఇన్‌ఛార్జి తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, గుబ్బ భరత్‌కుమార్ మాట్లాడారు. ఆలయాల్లో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను స్వయంగా భక్తులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పిన వారు మతిస్థిమితం లేనివారిగా చూపించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. నవరాత్రుల్లో ఆయా ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ధ్వంసం చేసిన అల్లరి మూకలను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, వివిధ ధార్మిక సంస్థల బాధ్యులు నరేందర్, జనార్దన్, విఘ్నేశ్, సురేశ్, వంశీ, లావణ్య, కవిత, హనుమంతు, భాస్కర్, శ్రీకాంత్, సంపత్, పూర్ణచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలని నిరసన


భూత్పూర్‌లో ఆందోళన చేస్తున్న భారాస శ్రేణులు

భూత్పూర్, న్యూస్‌టుడే: రైతుభరోసా నిధుల విడుదలకు డిమాండ్ చేస్తూ భారాస శ్రేణులను భూత్పూర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు రైతుభరోసా నిధులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలమూరు మార్గంలో రోడ్డుపై బైఠాయించిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. ఈ కార్యక్రమంలో పురపాలిక సంఘం అధ్యక్షుడు బస్వరాజుగౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకట్రాములు, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అడ్డాకుల, న్యూస్‌టుడే: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని భారాస మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్ అన్నారు. రైతు భరోసాను ప్రభుత్వం వాయిదాలు వేస్తున్న నేపథ్యంలో శనివారం మూసాపేట మండల కేంద్రం ఆదర్శ కూడలిలో భారాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కొండన్న, శేఖర్, జమీర్, మధు, రాజు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్లు ఇవ్వకపోవడంపై తాఖీదులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: బాదేపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో ఉడకబెట్టిన గుడ్లు ఇవ్వకపోవడంపై ప్రధానోపాధ్యాయుడు, మధ్యాహ్న భోజనం(ఎండీఎం) ఇన్‌ఛార్జి ఉపాధ్యాయుడికి తాఖీదులు అందించాలని డీఈవో రవీందర్ శనివారం జడ్చర్ల ఎంఈవో మంజులాదేవిని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి... గుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని పాఠశాల విద్యార్థులు.. గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. 2024 జూన్, జులై నెలల్లో వారానికి మూడు గుడ్లకు బదులుగా రెండు ఇచ్చారని, ఆగస్టు నెలలో, సెప్టెంబరులో 26వ తేదీ వరకు ఒక గుడ్డు కూడా ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారు. అధికారుల విచారణలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో విద్యార్థులకు గుడ్లు ఇచ్చినట్లు బిల్లులను సమర్పించారని తేలింది. ఈ వ్యవహారంపై ప్రధానోపాధ్యాయుడు, ఎండీఎం ఇన్‌ఛార్జి ఉపాధ్యాయుడికి తాఖీదులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి **రాజాపూర్, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి 44పై ఈనెల 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన దంపతులు పూజారి రాములు, లక్ష్మమ్మ ద్విచక్రవాహనంపై విట్యాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో రంగారెడ్డిగూడ చౌరస్తాలో వెనుక నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్రగాయాలు కాగా లక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రాములును చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ప్రమాదం జరిగిన రోజు రాములు భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రవి తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు.. **రాజాపూర్, న్యూస్‌టుడే:** మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన ఆంజనేయులు (38) అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆంజనేయులు భార్య ఉషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రవి తెలిపారు.

మహిళను బెదిరించి నగలు అపహరణ **మహమ్మదాబాద్, న్యూస్‌టుడే:** కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన అంజిలమ్మ గాధిర్యాల్‌గేట్ దగ్గర గుడి ఆశ్రమంలో పని చేస్తుంది. శుక్రవారం గణేశ్ అనే వ్యక్తి వేరొక మహిళతో కలిసి అంజిలమ్మను చంపుతానని బెదిరించి బంగారు పుస్తెలతాడు, రూ. 10 వేలు నగదు ఎత్తుకెళ్లాడు. అంజిలమ్మ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కేసు నమోదు **మిడ్జిల్, న్యూస్‌టుడే:** మండలంలోని బోయినిపల్లి గ్రామంలో గొలుసు దుకాణంపై దాడి చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం రాత్రి మద్యం విక్రయిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన శ్రీనుపై కేసు నమోదు చేశామన్నారు. గొలుసు దుకాణాలపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ **బాలానగర్, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలోని ఠాణాలో రౌడీ షీటర్లకు శనివారం ఎస్సై తిరుపాజీ కౌన్సెలింగ్ చేశారు. జిల్లా ఎస్పీ జానకీ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ చేసినట్లు తెలిపారు. మళ్లీ ఎక్కడ దౌర్జన్యాలు, దొంగతనాలు, క్రైమ్, అక్రమాలకు పాల్పడవద్దని సూచించారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యంపై ఫిర్యాదు **జడ్చర్ల, న్యూస్‌టుడే:** జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(26) ఆమె రెండేళ్ల కుమార్తె శుక్రవారం నుంచి కనిపించకుండా పోయారు. పెద్ద కుమార్తె పాఠశాలకు వెళ్లగా, భర్త పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా భార్య, చిన్న కుమార్తె కనిపించలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

వీరప్పయ్య స్వామి ఆలయ ఛైర్మన్‌గా నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: దేవరకద్ర పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీఈశ్వర వీరప్పయ్య స్వామివారి ఆలయ ఛైర్మన్‌గా బీచు నర్సింహారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులను నర్సింహారెడ్డికి అందజేశారు. కమిటీ సభ్యులుగా ఎం.రాఘవేంద్ర, వెంకటయ్య, లక్ష్మమ్మ, ఉషనయ్య, నాగరాజులను నియమితులైనట్లు చెప్పారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా ఫారూక్

దేవరకద్ర గ్రామీణం : దేవరకద్ర కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఫారూక్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి శనివారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జవహర్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, కార్యదర్శిగా రాజు, ఆంజనేయులు, కోశాధికారిగా శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం ఎన్నికైన వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంపాండు, నర్వ శ్రీను, కొండశ్రీను, రఘువీర్‌వర్మ పాల్గొన్నారు.

ముడా ఛైర్మన్‌కు యాదవ విద్యావంతుల వేదిక సన్మానం

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్) : ముడా ఛైర్మన్‌గా నియమితులైన లక్ష్మణ్‌యాదవ్‌ను యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధికి కృషిచేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బాలు యాదవ్, రవికుమార్, నారాయణ, భరత్‌కుమార్, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్

జడ్చర్ల పట్టణం : ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడ వైద్య సిబ్బందిని నియమించాలని మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్లలోని ప్రాంతీయ ఆసుపత్రిని భారాస నాయకులు సందర్శించారు. నాగసాలకు చెందిన కీర్తి ఈనెల 16న కాన్పు కోసం ఆసుపత్రికి రాగ వైద్యులు అందుబాటులో లేకపోవడం స్టాఫ్‌నర్సు కాన్పు చేయడంతో నవజాత శిశువు మృతి చెందిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై ఆసుపత్రి పర్యవేక్షకురాలు డా. చంద్రకళను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్తు అంతరాయాలు నివారించండి

మహబూబ్‌నగర్ గ్రామీణం : దివిటిపల్లిలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో రోజూ గంటల తరబడి విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని, అధికారులకు సమాచారమిచ్చినా చర్యలు తీసుకోవడం లేదంటూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇళ్ల యజమానులు శనివారం జడ్చర్లలో నిర్వహించిన విద్యుత్తు వినియోగదారుల సదస్సులో ఫిర్యాదు చేశారు. వర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా రోజంతా విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి ఫోరం ఛైర్మన్ పి. నాగేశ్వర్‌రావు దృష్టికి తెచ్చారు. లోఓల్టేజీ సమస్య కూడా ఉందని, ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, బల్బులు కాలిపోతున్నాయని తెలిపారు. స్పందించిన ఫోరం ఛైర్మన్ దివిటిపల్లిలోని ఇళ్ల సముదాయంలో విద్యుత్తు అంతరాయానికి సాంకేతిక కారణాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టి పరిష్కరించాలని ఎస్ఈ పీవీ రమేశ్, సంబంధిత డీఈ, ఏఈలను ఆదేశించారు.